క్లుప్తంగా

దసరా దృష్ట్యా పీజీఆర్‌ఎస్ రద్దు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం(పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 22, 29వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జరిగే కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నగర వాసులు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

శివరామకృష్ణ క్షేత్రంలో దసరా మహోత్సవాలు



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో 13 రోజులపాటు నిర్వహించే శరన్నవరాత్రులు ఆదివారం ప్రారంభమయ్యాయి. శారదా దేవిని అర్చక స్వాములు జగత్ప్రసూతికాంబగా అలంకరించారు. శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శృంగేరీ పీఠ సంప్రదాయాన్ని అనుసరించి శివరామకృష్ణ క్షేత్రంలోని ముగ్గురమ్మలకు వివిధ అలంకారాలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా నిత్య పూజలు, కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు.

సందడిగా ముందస్తు విజయదశమి పండుగ



పెనమలూరు: కానూరు భాష్యం పాఠశాలలో ముందస్తుగా దసరా పండుగను విద్యార్థులు నవ దుర్గాదేవి అవతారాలతో అలరించి సందడి చేశారు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఆకట్టుకునే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం నాటికలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోషి దసరా పండుగ, సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ బ్యూలా, ప్రిన్సిపాల్ శైలజ, హెచ్‌ఎం రేష్మ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: మోహన కృష్ణ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయకుడు ఆశయ్య పర్యవేక్షణలో గాయనీ గాయకులు షేక్ రసూల్‌బాబు, పి.రవికుమార్, లక్ష్మణ్ నాయక్, వి.రాంజీనాయక్, రూపశ్రీ, సుమ, సుకన్య, దీప్తిలు తెలుగు సినీ గీతాలను మధురంగా ఆలపించారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాయకుడు ఆశయ్యను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, బి.వి. వీరభద్రరావు, చావా నరసింహారావు, బి.లక్ష్మీబాయి, బి.లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో శ్రీకనకదుర్గ ఆలయ పునర్నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రూ.3.5 కోట్ల వ్యయంతో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ తెలియజేసింది. ఆదివారం దేవస్థానం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. 250 గజాల స్థలంలో 30 అడుగుల ఎత్తులో అమ్మవారి రాతి గుడిని ఆగమశాస్త్ర ప్రకారం రాజమహేంద్రవరం శిల్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆనాటి శిల్పకళా నైపుణ్యంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుమారు 35 సంవత్సరాల క్రితం స్థానికులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారన్నారు. అదే స్థలంలో భక్తులు, దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ గుంటక సంధ్యారాణి, కార్యదర్శి అంగజాల హనుమా, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సీతారామారావు, యర్కారెడ్డి మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, కమిటీ సభ్యులు దుంపల కృష్ణ, బాలాజీ నాయక్, రాంబాబు, దేవస్థానం అర్చకులు రొంపిచర్ల దత్తుకుమార్, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.









ఉత్సవ శోభ

శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబైంది. సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అసంపూర్తి పనులతో అవస్థలు

- కొద్దిపాటి వర్షానికే బురదగా మారుతున్న రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



వినాయకనగర్‌లో బురదగా మారిన రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అసంపూర్తి పనులు, కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో 30వ డివిజన్ వినాయకనగర్, 29వ డివిజన్ వీవీనరసరాజు రోడ్డు ప్రాంతవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానిక 30వ డివిజన్ వినాయకనగర్ 5వ రోడ్డు సమీపంలో రహదారి పనులకు 5నెలల క్రితం శంకుస్థాపన చేశారు. కొద్ది రోజులకు ఎర్రమట్టి పోసి వదిలేశారు. ఇక అప్పటి నుంచి రోడ్డును పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. దీంతో కొద్దిపాటి వర్షాలకే రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు వాహన చోదకులు నానాయాతన పడుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు

ఇక్కడ రోడ్డు పనులు నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదగా మారడంతో కనీసం ఇంట్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట రాకపోకలు సాగించే క్రమంలో తరచూ జారి ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినప్పటికీ కాంట్రాక్టర్ పనిచేయడం లేదని చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కనీసం తమ రోడ్డులోకి ఎవరూ రావడం లేదని, గ్యాస్ సిలిండర్ కూడా తెచ్చేందుకు ఇష్టపడటం లేదని ఆరోపిస్తున్నారు.

ఏడాదిగా పూర్తికాని పనులు

మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో కాంపౌండ్ వాల్ పనులు మొదలు పెట్టి ఏడాది దాటింది. అయినప్పటికీ ఇక్కడ పనులు మాత్రం పూర్తిచేయలేదు. దీంతో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా కాంపౌండ్ వాల్ దాటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా అక్కడ చెత్తాచెదారం వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా తయారవడంతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. సువిశాలంగా ఉండే వీవీ నరసరాజు రోడ్డు కాలువగట్టు ప్రాంతంలో మొక్కలు పెంచి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. వినాయకనగర్ రోడ్డు పనులతో పాటు ఇక్కడ పనులు కూడా ఒకే కాంట్రాక్టర్ చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ ఎక్కడికక్కడ పనులు ప్రారంభించి పూర్తిచేయకుండా సగంలోనే వదిలివేస్తున్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వీవీనరసరాజు రోడ్డులో అసంపూర్తిగా వదిలివేసిన కాంపౌండ్ ప్రహరీ

పనులు పూర్తిచేయాలి



వినాయకనగర్‌లో రోడ్డు పనులు పూర్తిచేయకపోవడంతో ఇంటికి కనీసం గ్యాస్ సిలిండర్ కూడా రావడం లేదు. ఇక చెత్తను తీసుకువెళ్లే వారి సంగతి చెప్పనవసరం లేదు. ఈ రోడ్డులోకి రావాలంటేనే భయపడిపోతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డులో నా మనుమడు, మనుమరాలు జారి పడి గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలి. కనీసం రోడ్డు బురదగా మారకుండా అయిన తగిన చర్యలు చేపట్టాలి.

– బి.సరస్వతి, వినాయకనగర్

సాహిత్యం ప్రజాజీవితంలో భాగస్వామి కావాలి



సాహిత్య ప్రసంగం చేస్తున్న పింగళి వెంకటకృష్ణారావు, వేదికమీద కావూరి సత్యవతి తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్యం ప్రజాజీవితంలో భాగస్వామి కావాలని విశ్రాంత తెలుగు అధ్యాపకుడు పింగళి వెంకట కృష్ణారావు పేర్కొన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్‌లో ఆదివారం తెలుగు సాహితీ సుమ సౌరభాల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పింగళి మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యం సమాజహితం కోరుకుంటుందని చెప్పారు. ప్రాచీన సాహిత్యంలో ముఖ్యంగా ధర్మ రక్షణ కనిపిస్తుందన్నారు. విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ కావూరి సత్యవతి తెలుగు భాషా మధురిమలు, కె.నరసింహమూర్తి అమరావతి కథలు, వై.రాజేశ్వరి ఆటవెలది – తేటగీతి మన తెలుగు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ చేమకూర వేంకటకవి విజయవిలాసం, పి.వెంకట శైలజ కందంలో తెలుగు అందాలు అంశంగా ప్రసంగించారు. ప్రబోధాత్మక కవి కె. శ్యాంప్రసాద్‌రెడ్డి వాట్ ఈస్ రామాయణ టూమీ అంశంగా కవితాగానం చేశారు.

దొంగ స్వాములు ఆక్రమించిన భూములపై అసెంబ్లీలో చర్చ జరపాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాముల వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరపాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాతికేళ్లుగా కొందరు దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించినట్టు తెలిపారు. ఆశ్రమాల పేరుతో యజ్ఞయాగాలు, దీక్షలు చేస్తూ ప్రజలను, ప్రభుత్వాన్ని రకరకాలుగా మోసం చేస్తున్నారని, వీటిపై అసెంబ్లీలో చర్చపెట్టి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తి సత్యసాయిబాబు శత జయంతి వేడుకలు ప్రభుత్వమే జరపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వమే ఇలాంటివి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు దొంగరామదూత ఆక్రమించిన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములపై తప్పనిసరిగా చర్చ జరపాలని ఆయన కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభావతి, కృష్ణప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంటు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం స్పందన వాకర్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం ప్రశాంతినగర్ ఎస్‌ఎస్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె తండ్రిలేని పేద విద్యార్థిని ఈపూరి మధుప్రియకు రూ. 20వేలు స్పందన ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే 20 మంది విద్యార్థులకు రూ.8వేల విలువ చేసే పౌష్టికాహారం కిట్లు, వాకర్స్ పోటీల్లో పాల్గొన్న 12 మంది వాకర్స్‌కు, యోగా విన్యాసాలు చేసిన 30 మందికి, కోలాటం మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్టు 202 గవర్నర్ ఎ.విజయలక్ష్మి, స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.మురళి, కోశాధికారి ఎస్.చెన్నకేశవరావు, యోగా మాస్టర్ కె.నరసింహామూర్తి, మాజీ గవర్నర్లు ఎక్స్‌రే కొల్లూరి, కేఎస్ ప్రకాశరావు, శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పీఎస్ ప్రాంగణంలో సీపీ పూజలు



పూజలు నిర్వహిస్తున్న సీపీ రాజశేఖరబాబు దంపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దసరా ఉత్సవాల ముందు రోజున పోలీసు శాఖ నుంచి అమ్మవారికి పట్టుచీర, పసుపు కుంకుమలను సమర్పించడం గడిచిన దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం సీపీ దంపతులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకొని అక్కడ ప్రతి ఏటా నిర్వహించే విధంగా రావిచెట్టు వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ ఎన్.దుర్గారావు పాటు నగరంలోని సీఐలందరూ సతీమణులతో కార్యక్రమానికి హాజరయ్యారు. అదేవిధంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సిబ్బంది మొత్తం కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరయ్యారు. పూజల అనంతరం సీపీ దంపతులు అమ్మవారికి సమర్పించే పట్టుచీర, పసుపు కుంకుమలను చేతబూని గుర్రపుబంగీ ఎక్కి దుర్గగుడికి పయనమయ్యారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, పోలీసుబ్యాండ్, తీన్‌మార్ సందడితో ఊరేగింపుగా దుర్గమ్మ సన్నిధికి తరలివెళ్లారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో ఉత్సవానికి శ్రీకారం చుట్టడంతో పోలీసు సిబ్బంది మొత్తం హర్షం వ్యక్తం చేస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులందరూ సివిల్ డ్రెస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక సీఐ జి.గురుప్రకాష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు పడిన అధికారులు

ఆదివారం సాయంత్రం జోరున వర్షం కురవడంతో పూజకు హాజరైన పోలీసు కుటుంబాలు, అధికారులు ఇబ్బందులెదుర్కొన్నారు. పూజల సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో స్థానిక పోలీసు అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వర్షం కురవడంతో ఇబ్బంది పడ్డారు. అనంతరం పూజలు నిర్వహించి ఊరేగింపుగా కొండపైకి వెళ్లారు.

నేత్రపర్వంగా సంగీత నృత్య సమ్మేళనం

విజయవాడకల్చరల్: శ్రీవాగ్దేవీ వాయిద్య సంగీత, నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యాన లబ్బీపేటలోని శ్రీశారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య సమ్మేళనం నేత్రపర్వంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహినీ అట్టం, జానపద అంశాలను ప్రదర్శించారు. వాయిద్య కళాకారుల బృందం ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజ స్వామి, తాళ్లపాక అన్నమాచార్యుని కీర్తనలను పలికించారు.



దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సిద్ధమైన శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం



మధురానగర్ మెయిన్ రోడ్డులో సెట్టింగ్

నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- నేటి నుంచి దసరా ఉత్సవాలు
- విద్యుత్ దీపాలతో శోభయమానంగా ఆలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవాలయాలను ముస్తాబు చేశారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, గ్రామ దేవత గంగానమ్మ ఆలయం, మధురానగర్ మెయిన్‌రోడ్డు, రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం, సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ ఆలయం, జీవీఆర్‌నగర్ దేవుని మండపం, దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి ఆలయాలను ఇప్పటికే విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

రోజుకొక అలంకారంతో అమ్మవార్ల దర్శనం

ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు జరగనున్నాయి. రోజుకొక అలంకారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారిని 11 రోజులపాటు రోజుకో అలంకారంలో పూజలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 2న శమీ వృక్ష పూజ, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 3న శ్రీశివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వర స్వామివార్ల శాంతి కల్యాణం, 4న అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వచ్చేనెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు తెలిపారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో దసరా ఉత్సవాలకు భారీ సెట్టింగ్ వేశారు. ఇక్కడ దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

పాయకాపురం(విజయవాడరూరల్): హిందువులు జరుపుకొనే పెద్ద పండుగల్లో ఒకటైన విజయదశమి వేడుకలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. రాజీవ్‌నగర్‌లో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, ప్రజాశక్తినగర్‌లోని కనకదుర్గమ్మవారి ఆలయం, సుందరయ్యనగర్ వాసవీమాత ఆలయం, పాయకాపురం సంతోషిమాత ఆలయాలు విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్నాయి. మొదటిరోజు సోమవారం అమ్మవారికి శ్రీబాలా త్రిపుర సుందరి దేవీగా అలంకారం చేసి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించేందుకు నిర్వహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు.



శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద స్వాగత ద్వారం



మధురానగర్ మెయిన్ రోడ్డులో విద్యుద్దీపాల వెలుగులు



రాజీవ్‌నగర్‌లో శ్రీకనకదుర్గమ్మ ఆలయం

నడకతో మంచి ఆరోగ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నడకతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని, కావున ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతగా నడవడం అలవాటుగా చేసుకోవాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక గులాబీతోట అమరావతి వాకర్స్ క్లబ్‌లో ఆదివారం వారు వాకర్స్ పతాకాన్ని ఎగురవేసి క్లబ్ వ్యవస్థాపకులు సుంకరి ఆళ్వార్ దాస్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. డిస్ట్రిక్ట్ వాకర్స్ నాయకులు కొండాయగుంట రాము, బండారు కొండ, యర్రంశెట్టి శ్రీను, గంగాధర్, శ్రీనివాస రాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





నగరంలో జోరు వాన

నగరంలో ఆదివారం సాయంత్రం జోరు వాన కురిసింది. సాయంత్రం 6 గంటల నుంచి నిరంతరాయంగా వర్షం కురవడంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో రోడ్లన్నీ చెరువులను తలపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కాపులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- డిసెంబర్ 26 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు
- కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ రావి శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి(కేఆర్‌పీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేని పక్షంలో దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి రోజైన డిసెంబర్ 26న నిరవధిక నిరాహార దీక్షలకు దిగనున్నట్లు తెలిపింది. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కేఆర్‌పీఎస్ సమావేశం జరిగింది. కేఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, చైర్మన్ చనమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాపులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాల వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పోస్టుల్లో జనాభా ప్రాతిపదికగా 12 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా కార్యాచరణతో ముందుకెళతామన్నారు. కాపు రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాపు జేఏసీ నాయకులు మాసాబత్తుల శ్రీనివాస్, ముత్యాల రామదాసు, రాయలసేన ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.